సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వైభవంగా స్నపన తిరుమంజనం



శ్రీవారిని అర్చిస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజన సేవను వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

రంగనాథ స్వామి ఆలయానికి బోరు వితరణ



రంగనాథ స్వామి ఆలయ ఆవరణలో బోరు తవ్విస్తున్న దాతలు

తగరపువలస: ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ గుడిలోవలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరంగనాథ స్వామి ఆలయానికి బోరుబావి నిమిత్తం మహంతి రమాదేవి రూ.80వేలు అందించారు. ఈ నగదుతో చందక శివ ఆధ్వర్యంలో కొణతాల సంతోష్, శంకర్, సోమినాయుడు, వెంకటరావు, రమణ తదితరులు శుక్రవారం బోరుబావి తవ్వించారు.

కొమ్మాది రెవెన్యూ గ్రామసభ 9వ తేదీకి మార్పు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం కొమ్మాది రెవెన్యూ గ్రామంలో శనివారం నిర్వహించ తలపెట్టిన గ్రామ సభను 9వ తేదీ సోమవారం నాటికి మార్చినట్లు తహసీల్దారు పాల్ కిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. కొమ్మాది గ్రామంలోని కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తామని, అంతా గమనించాలని కోరారు.

పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన నేడు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పాత పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉదయం 10 గంటల నుంచి ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విశాఖ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు కోరారు.

పోలీస్ బెటాలియన్‌లో ఆర్సీ కోర్సులు ప్రారంభం



మాట్లాడుతున్న 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులోని ఏపీఎస్పీ పోలీస్ 16వ బెటాలియన్‌లో శుక్రవారం రిఫ్రెషర్ కోర్సులు ప్రారంభమయ్యాయి. బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ 14 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖలోని ఉద్యోగులు, అధికారుల విధి విధానాలకు సంబంధించిన అంశాలపై మరింత మెరుగైన అవగాహన కల్పిస్తామన్నారు. సిబ్బంది మానసిక, శారీరక ఆరోగ్యాల కోసం జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఏ–11, బీ–01, ఈ–32, ఎఫ్–25, జీ–27 మొత్తం 96 కోర్సులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్ పి.సత్యం, ఇలియసాగర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9493185214
సాక్షి

పేరుకు జీవీఎంసీ పరిధే అయినా.. మార్గం మారుమూల ప్రాంతాల కంటే అధ్వానం. ఆ గ్రామానికి చేరుకోవాలంటే తుప్పల మధ్య, కాలిబాటల్లో బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిందే. ఇక వర్షం పడితే ప్రయాణం నరకప్రాయం. అధికారులు, నాయకులకు ఎన్నోమార్లు విన్నవించినా ఫలితం మాత్రం శూన్యం. ఇదీ భీమిలి జోన్‌లోని మొదటి వార్డులో చిట్టివలస కల్లాలుగా పిలుచుకునే గ్రామం దుస్థితి.. దశాబ్దాలుగా మారని పరిస్థితి..

ప్రయాణం.. ప్రాణ సంకటం

చిట్టివలస కల్లాలకు కాలిబాటలే శరణ్యం



కల్లాల రాకపోకలకు వినియోగిస్తున్న కాలిబాటలు

- తుప్పలు, చెట్ల మధ్య బిక్కుబిక్కుమంటూ ప్రయాణం
- చీకటి పడితే విష పురుగులతో భయం
- దశాబ్దాలుగా సాకారం కాని రోడ్డు మార్గం



తుప్పల మధ్య నుంచి కల్లాలకు మార్గం



తుప్పలు, చెట్ల మధ్య విష పురుగులకు అడ్డా అయిన కాలిబాట

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లోని చిట్టివలస కల్లాలకు సరైన మార్గం లేక గ్రామస్తులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆ గ్రామం చేరుకోవాలంటే సుమారు 750 మీటర్లు కాలిబాటలే శరణ్యం. చిట్టివలస చెరువును ఆనుకుని ఉన్న బొగ్గురోడ్డు నుంచి కల్లాలకు చేరుకోవాలి. ఆ మార్గం కూడా నేరుగా కాకుండా తుప్పలు, చెట్ల మధ్య నుంచి వంపులు తిరిగి ఉంటుంది. ఈ మార్గంలో వీధిదీపాలు కూడా లేకపోవడంతో రాత్రే కాకుండా పగటివేళ కూడా ఒంటరిగా రాకపోకలు సాధ్యం కాదు. నిత్యం ఈ కాలిబాటల మార్గంలో విషపురుగులు సంచరిస్తూ ఉంటాయి. శబ్దం చేసుకుంటూ వెళ్లకపోతే వాటి బారిన పడటం ఖాయం. ఇక వర్షాకాలం వచ్చిందంటే గుంపులుగా కూడా అక్కడి ప్రజలు రాలేరు. ఉన్న కాలిబాటలు కూడా తుప్పలతో మూసుకుపోతాయి. తప్పదనుకుంటే విజయనగరం జిల్లా భోగాపురం మండలం గుడివాడ పంచాయతీకి చెందిన శ్రీరామనగర్ మీదుగా తిరిగి రావలసి ఉంటుంది.

బడీ లేదు, అంగన్‌వాడీ లేదు

చిట్టివలస కల్లాలలో బడికి వెళ్లే చిన్నారులు 40 మంది వరకు, అంగన్‌వాడీలకు వెళ్లే బాలలు 25 మంది వరకు ఉంటారు. వీరికి అందుబాటులో ఈ రెండూ లేవు. గతంలో రేషన్ తీసుకోవడానికి రెండు కిలోమీటర్ల దూరంలో చిల్లపేటకు, సామాజిక పింఛన్లు తీసుకోవడానికి కిలోమీటర్ పరిధిలో ఉన్న చిట్టివలసకు ఇక్కడి వారు వచ్చేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంటింటికీ రేషన్ బళ్లు, సచివాలయ వ్యవస్థల కారణంగా ఇప్పుడు ఈ రెండు వసతులు గ్రామంలోనే అందుతున్నాయి. ఈ గ్రామానికి పైపులైన్ లేని కారణంగా అప్పుడప్పుడూ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తారు. వర్షాలు పడితే అది కూడా కష్టమే. అతి కష్టం మీద విద్యుత్ సరఫరా, వీధిలైట్ల వసతులు ఇక్కడ ఉన్నాయి. చిట్టివలస పంచాయతీ భీమిలి మున్సిపాలిటీలో విలీనం అయిన దగ్గర నుంచి సుమారు నాలుగు దశాబ్దాలుగా కల్లాల ప్రజలు తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని మొర పెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు తమ గోడు పట్టించుకోవాలని, మార్గం నిర్మించాలని కోరుతున్నారు.



ఈ మార్గంలో ఒంటరిగా వెళ్లాలంటే భయం భయం

సర్వేలతో సరి

ఎన్నికలు వచ్చిన ప్రతీసారి వివిధ పార్టీల అభ్యర్థులు కల్లాలకు పక్కా రోడ్డు నిర్మిస్తామని సర్వేలతోనే సరిపెడుతున్నారు. కల్లాల్లో 150 వరకు కుటుంబాలు, మధ్యలో మరో 50 కుటుంబాలు ఉంటాయి. గత ప్రభుత్వాలు శారద పబ్లిక్ స్కూల్ వరకే వసతులు కల్పించి కల్లాలను విస్మరించాయి. ముఖ్యంగా కల్లాలలో దళిత కుటుంబాలే ఎక్కువ. వీరితో పాటు తగరపువలస వచ్చేందుకు శ్రీరామ్‌నగర్ వాసులు కూడా దగ్గర మార్గమని, ఈ నడక మార్గాన్నే ఎంచుకుంటారు.

పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు

- డీఈవో ప్రేమ్‌కుమార్
- భీమిలి కేజీబీవీ సందర్శన



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో

భీమునిపట్నం: విద్యార్థినులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పట్టుదలతో చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యాలయం నిర్వహణపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పలు పాఠ్యాంశాలపై ప్రశ్నించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, కష్టపడి చదివితే ఉన్నత స్థానంలో స్థిరపడవచ్చని సూచించారు. ఇక్కడ మంచి సదుపాయాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం రికార్డులను, వంటశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



కురపల్లిలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయ్ కుమార్

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లిలో పారిశుధ్య పనులను ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులు చేపట్టారు. ఈ పనులను ఎంపీడీవో పరిశీలించారు.

ముగిసిన 'కళా ఉత్సవ్' పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతికుమారి

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) వద్ద రెండు రోజులు జరిగిన అంతర్ జిల్లాల కళా ఉత్సవ్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఇందులో నృత్య విభాగంలో అనకాపల్లికి చెందిన రష్మిత అపూర్వ మొదటి స్థానం, భీమిలికి చెందిన నిఖిత రెండో స్థానం సాధించారు. నాటిక విభాగంలో నడుపూరుకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో, ఆరిపాకకు చెందిన విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు, దృశ్య కళా విభాగంలో నడుపూరుకు ప్రథమ, కాశిపురానికి ద్వితీయ స్థానం లభించింది. సంప్రదాయ కథల విభాగంలో చంద్రంపాలెం ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో భీమిలి నిలిచింది. విజేతలకు ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

11న భగవద్గీత పారాయణం

తగరపువలస: గీతాజయంతి సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద చిన్నారులచే భగవద్గీతలోని 700 శ్లోకాలు పారాయణం చేయించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో పారవశ్యమైన కీర్తనల ఆలాపనతో పాటు భక్తులకు ప్రసాదం పంపిణీ చేయనున్నారు. వివరాలకు 95425 11108, 96663 99108లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

స్ఫూర్తిప్రదాత అంబేడ్కర్

వర్ధంతి సందర్భంగా రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు



టి.నగరపాలెంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న భీమిలి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



తగరపువలస అంబేడ్కర్ కూడలిలో నివాళులు అర్పిస్తున్న జీవీఎంసీ 1,2 వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు



వేములవలస కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఆనందపురం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



సీపీఐ కార్యాలయంలో..



ముత్తంశెట్టి క్యాంప్ కార్యాలయం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గిరిజన సాంస్కృతిక శిక్షణా మిషన్ భవన్‌లో నివాళులు అర్పిస్తున్న ఈడీ డా.రాణి మందా



మజ్జివలసలో నివాళులు అర్పిస్తున్న గ్రామ యువత



అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



జోనల్ కార్యాలయం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి



మధురవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు నాయకులు, అధికారులు సూచించారు. బడుగు, బలహీన వర్గాలకు సమాన హక్కులు కల్పించారని కొనియాడారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా భీమిలి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సూచించారు. భీమిలి, తగరపువలస, ఆనందపురం, మధురవాడ, కొమ్మాది, మారికవలస, పీఎం పాలెం, పద్మనాభం పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఆనందపురం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఆనందపురం ఎంపీపీ జానకి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతిన హనుమంతురావు, ఎస్సీ సెల్ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సియ్యాద్రి కనకరాజు, పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ వార్డు ఇన్‌చార్జిలు, భీమిలి జెడ్సీ ప్రేమప్రసన్నవాణి, టీసీఆర్‌టీఎం ఈడీ డా. రాణి మందా, దళిత నాయకులు, అధికారులు, అంబేడ్కర్ అభిమానులు, జైభీమ్ యూత్ ప్రతినిధులు, అంబేడ్కర్ యువజన సేవాసంఘం సభ్యులు, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొని, ఘన నివాళులు అర్పించారు. – తగరపువలస/భీమిలి/మధురవాడ/కొమ్మాది/పద్మనాభం



తాళ్లవలసలో నివాళులు అర్పిస్తున్న గోపాలరావు

ముళ్ల పొదలతో అవస్థలు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెం వద్ద బోని వాటర్ వర్క్స్–ఆనందపురం రోడ్డు మీదకు ముళ్ల పొదలు విస్తరించాయి. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డుపై ఆనందపురం, పద్మనాభం మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రం విశాఖపట్నానికి ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు నిరంతరం ప్రయాణిస్తుంటాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ముళ్లపొదలు విస్తరించడంతో, ఎదురుగా వచ్చే లారీల వంటి భారీ వాహనాలు తప్పించే ప్రయత్నంలో ఆటోల్లో ప్రయాణికులు, ద్విచక్ర వాహన చోదకుల కళ్లకు తగులుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి, రోడ్డు మీదకు విస్తరించిన ముళ్ల పొదలను తొలగించాలని కోరుతున్నారు.



ఏనుగులపాలెం వద్ద రోడ్డు మీదకు విస్తరించిన ముళ్ల పొదలు

'మధ్యాహ్న భోజనం' తనిఖీ

తగరపువలస: మధ్యాహ్న భోజన పథకం సమన్వయకర్త జె.ఎస్.శాస్త్రి శుక్రవారం భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వడ్డించే భోజనాలను తనిఖీ చేశారు. మెనూ అమలవుతున్న తీరు గురించి విద్యార్థులను, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ సోమేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ, వంటగది శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఆయనకు ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు టి.వి.ఎస్ ప్రసాదరావు, అప్పలనాయుడు, మురళీధర్, శ్రీనివాసరావు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సమాచారం అందించారు.



తాటితూరు హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న సమన్వయకర్త శాస్త్రి

రెవెన్యూ సదస్సులకు స్పందన అంతంత మాత్రమే..

భీమిలి నియోజకవర్గ పరిధిలో శుక్రవారం ప్రారంభమైన రెవెన్యూ సదస్సులకు స్పందన అంతంత మాత్రంగానే లభించింది. పరిమిత సంఖ్యలోనే ఫిర్యాదుదారులు హాజరయ్యారు.

- పరిమితంగానే హాజరైన ప్రజలు



మారికవలస సభకు పరిమితంగా హాజరైన ఫిర్యాదుదారులు



విశాఖ రూరల్ మండలంలో ఫిర్యాదుల రిజిస్టర్ పరిశీలిస్తున్న ఆర్డీవో సంగీత్ మాథుర్



భీమిలిలో సదస్సు నిర్వహిస్తున్న అధికారులు



రెడ్డిపల్లి సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుధా సాగర్

భీమునిపట్నం: భీమిలిలో తహసీల్దారు పైల రామారావు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు, ఇళ్ల నిర్మాణాలు, స్థలాల విషయాల్లో సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మత్స్యకారులకు సంబంధించిన గ్రామాభివృద్ధి సేవాసంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు .. బీచ్‌లో జరుగుతున్న ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు. ఇక్కడి సదస్సులో మొత్తం తొమ్మిది వినతులు వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనుబాబు, టౌన్‌ప్లానింగ్ సర్వేయర్ సూర్యనారాయణ, దేవదాయశాఖ అధికారులు మురళీమోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామానికి దూరంగా సభ

మధురవాడ: మారికవలస ఆర్‌జీకే కల్యాణ మండపంలో తహసీల్దారు పాల్‌కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ప్రజల నుంచి పరిమిత స్థాయిలోనే స్పందన లభించింది. భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, ప్రత్యేక అధికారి, హౌసింగ్ పీడీ సీహెచ్ సత్తిబాబు పాల్గొన్నారు. అయితే విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలో నిర్వహించాల్సిన గ్రామ సభను దూరంగా మారికవలసలో పెట్టడం ఎంతవరకు సబబని పరదేశిపాలెం మాజీ సర్పంచ్, టీడీపీ విశాఖ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బోయి శ్రీను, టీడీపీ నాయకుడు మొల్లి లక్ష్మణరావు తదితరులు అధికారులను ప్రశ్నించారు. గెడ్డల ఆక్రమణ, భూములను ఆన్‌లైన్ చేయకపోవడం, హద్దుల ఏర్పాటు, ఆన్‌లైన్ తదితర సమస్యలపై 28 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, ఆర్ఐ ఏవీ కిషోర్, మండల సర్వేయర్ ప్రసాద్, ఎండోమెంట్ ఈవో రాజగోపాలరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రత్యేక అధికారి ఎస్.సుధాసాగర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుల్లో మ్యుటేషన్, భూసమస్యల కోసం వచ్చిన దరఖాస్తులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. సదస్సులో 80 మంది దరఖాస్తు చేసుకున్నారు. మ్యుటేషన్ కోసం 75, ఎండోమెంట్ భూమికి సంబంధించి ఒకరు, భూసమస్యలు పరిష్కరించాలని నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆనందరావు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకుడు సిరుగుడి ఆదినారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు పాల్గొన్నారు.